ప్లాస్టిక్ రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దాలి

మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పట్టణాన్ని చెత్త రహిత, ప్లాస్టిక్ రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దడానికి పట్టణ ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రతి ఇంటిలో వచ్చే చెత్త విభజించి పారిశుధ్య కార్మికులకు మాత్రమే ఇవ్వాలని, చెత్తను డ్రెయిన్‌లలో కానీ, రోడ్డుల మీద కానీ వేయకుండా ప్రతీఒక్కరూ పురపాలక సంఘ వాహనానికి తడి, పొడి చెత్త ఇచ్చి సహకరించాలన్నారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం చెత్త రహిత, ప్లాస్టిక్ రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దడానికి ప్రజల సహకారం కావాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

'కౌలు' కష్టం..!



- అగమ్యగోచరంగా కౌలు రైతుల పరిస్థితి
- పంట రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు ససేమీరా
- ఉన్నతాధికారుల ఒత్తిడితో విదిలిస్తున్న వైనం
- పశ్చిమలో రూ.105 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.140 కోట్లు మాత్రమే
- కోతయంత్రాల ఛార్జీల వసూలుపై కొరవడిన నియంత్రణ
- ఎకరాకు రూ.3వేలకు పైగా రైతుల నుంచి దోపిడీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒక పక్క బ్యాంకుల నుంచి పంట రుణాలందక, ఎరువులు, పురుగుమందులతోపాటు, కోత యంత్రాల ఛార్జీల పెంపుతో పెట్టుబడులు పెరిగి అన్నదాత పడుతున్న కష్టాలు వర్ణణాతీతంగా మారాయి. కౌలు రైతులకు పంటరుణాల మంజూరులో బ్యాంకర్లు తీవ్ర వివక్ష చూపుతున్న పరిస్థితి కొనసాగుతోంది. రెండు జిల్లాల్లో జారీ చేసిన కౌలు కార్డులకు, బ్యాంకర్లు ఇచ్చిన పంట రుణాలకు సంబంధం లేకుండా పోయింది. ఏలూరు జిల్లాలో మొత్తం 64,873 కౌలు కార్డులు (సిసిఆర్‌సి) జారీచేయగా ఇప్పటి వరకూ రుణాలు అందుకున్న రైతులు 22,798 మంది మాత్రమే. ఇచ్చిన రుణం కూడా కేవలం రూ.140 కోట్లే. ఈ రుణం సైతం సైతం పూర్తిగా కౌలుకార్డుల ప్రాతిపదికన ఇవ్వలేదు. సిసిఆర్‌సి, జెఎల్‌జి, ఆర్‌ఎంజి గ్రూపులకు మొత్తం కలిపి ఇచ్చిన రుణం మాత్రమే. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలురైతులకిచ్చిన రుణం ఒక్కశాతం కూడా లేదంటే ఆశ్చర్యపోక తప్పదు. పశ్చిమగోదావరి జిల్లాలో 87 వేల మంది కౌలు రైతులకు కౌలు కార్డులు జారీకాగా, రుణం అందుకున్న రైతులు 23 వేల మంది మాత్రమే. ఇచ్చిన రుణం కేవలం రూ.105 కోట్లే. ఖరీఫ్ పూర్తయ్యి, రబీ సాగుకు సైతం రైతులు సన్నద్ధమవుతున్న పరిస్థితి నెలకొంది. రబీకి సంబంధించి అక్టోబర్ నుంచి బ్యాంకులు రైతులకు రుణాలు మంజూరు చేస్తున్నాయి. రుణాలు మాత్రం సాగుచేసే కౌలురైతులకు కాకుండా, భూ యజమానులకు ఇస్తున్న పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం కౌలురైతులే చేస్తున్నారు. సాగులో కీలకపాత్ర పోషిస్తున్న కౌలు రైతులకు మాత్రం బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. దీంతో పెట్టుబడుల కోసం కౌలు రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతం. కౌలుకార్డుల విషయంలోనూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కౌలు రైతులు, రుణాల కోసం యుద్ధమే చేయాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. ఇచ్చిన రుణాలు సైతం కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు బ్యాంకర్లపై తెస్తున్న ఒత్తిడితో ఇస్తున్నవే. అంతే తప్ప కౌలురైతులకు అండగా నిలబడాలన్న ఆలోచనలో బ్యాంకర్లు లేకుండా పోయిన పరిస్థితి నెలకొంది.

కోతయంత్రాల ఛార్జీలతో పెట్టుబడి తడిసి మోపెడు..

వరిసాగులో పెట్టుబడి విపరీతంగా పెరిగిపోవడంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎరువులు, పురుగుమందులు ఖర్చులు ఇప్పటికే ఆకాశాన్ని తాకాయి. ఇప్పుడు కోతయంత్రాల ఛార్జీలు సైతం రైతులను వణికిస్తున్నాయి. ఇప్పటి వరకూ గంటకు రూ.2,600 చొప్పున వరికోతకు వసూలు చేసేవారు. ఇప్పుడు ఏకంగా రూ.మూడు వేల నుంచి రూ.3,500 వరకూ వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఈదురుగాలులకు అత్యధిక పొలాలు నేలకొరిగిన పరిస్థితి నెలకొంది. దీంతో ఎకరా కోయడానికి రెండు నుంచి మూడు గంటలు కూడా పడుతోంది. దీంతో ఎకరాకు కో... యంత్రాలకు రూ.తొమ్మిది వేల నుంచి రూ.పది వేలు ఖర్చవుతోంది. ఊహించని స్థాయికి కోత యంత్రాల ఖర్చు పెరగడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కోతయంత్రాల యజమానులంతా ఒక్కటిగా కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. కోతమిషన్ల ఛార్జీలపై గతంలో అధికారులు కొంత నియంత్రణ చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో వాటి యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని కోతయంత్రాల ఛార్జీలను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు. సాగుచేసే కౌలురైతులకు సరైన గుర్తింపు లేకపోవడంతో వారి కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్న పరిస్థితి నెలకొంది. కౌలు చట్టంలో మార్పులు చేస్తామని చెప్పిన ప్రభుత్వం మిన్నకుండిపోయింది. దీంతో రబీలోనూ కౌలురైతులకు న్యాయం జరగని పరిస్థితి నెలకొంది.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

అధికారులను వివరాలు అడుగుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కొమ్ముగూడెం పరపతి సంఘం కార్యకలాపాలను ఆదర్శంగా తీసుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న పిఎసిఎస్‌లో అదే విధంగా కార్యకలాపాలు నిర్వహించి సహకార సంఘాలను బలోపేతానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. మంగళవారం మండలంలోని కొమ్ముగూడెం విశాల పరపతి సహకార సంఘం వద్ద సహకార సంఘాల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కలెక్టర్ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత సప్తవర్ణ సహకార పతాకాన్ని కలెక్టర్ ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పరపతి సహకార సంఘం ప్రాంగణంలోని ఎరువులు, పురుగు మందులు, పశువుల దాణా దుకాణాలను, సూపర్ మార్కెట్‌ను, మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి వాటిలో జరుగుతున్న వ్యాపార లావాదేవీలపై ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడారు. 1956లో కొమ్ముగూడెంలో సహకార సంఘాన్ని ప్రారంభించి రూ.4.90 కోట్ల మూలధనంతో నిర్వహించడం గర్వించదగిన విషయమన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20వ తేదీ వరకూ వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర అనే థీమ్‌తో నిర్వహించుకుంటున్నామన్నారు. జిల్లాలో మొత్తం 122 సహకార పరపతి సంఘాలు ఉన్నాయని, వాటిలో 115 పిఏసిఎస్ వద్ద సిఎస్‌సిలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాకు కేటాయించిన 24 మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణాల్లో ఇప్పటివరకూ 12 పూర్తి చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారని తెలిపారు. సహకార సంఘాల ద్వారా రూ.36 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందని, రూ.15 కోట్ల టర్నోవర్‌తో పది రకాల వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తాడేపల్లిగూడెం ప్రాంతంలో ఎక్కువగా పామాయిల్, కోకోనట్ పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు ఆలోచన చేసి మహిళలు, యువతకు అవకాశం కల్పించడం ద్వారా దేశానికి, ప్రపంచానికి మంచి పేరు తేవాలని సూచించారు. జిల్లా సహకార శాఖ అధికారి ఎం.నాగరాజుతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా సహకార శాఖ అధికారి ఎం.నాగరాజు, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, సొసైటీ సిఇఒ సిహెచ్ వి.కృష్ణశర్మ, తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలి

సిపిఎం పట్టణ మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి బలరాం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టడం ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఎం 8వ గూడెం పట్టణ మహాసభ మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కరెడ్ల రామకృష్ణ, గొల్లు లక్ష్మి, జవ్వాది శ్రీను అధ్యక్షతన జరిగింది. ముందుగా బలరాం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను పాటల ద్వారా వివరించారు. గత మూడేళ్లలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాలను నివేదిక రూపంలో కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు ప్రవేశపెట్టారు. ఈ నివేదికను పార్టీ పట్టణ సభ్యులు చర్చించి ఆమోదించారు. నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని, స్మార్ట్ మీటర్లు పెట్టడం ఆపాలని, జమిలి ఎన్నికల పేరుతో పక్కదారి మళ్లించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ఈ మహాసభకు పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, జెఎన్‌వి గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, పెంటపాడు మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం కృషి చేస్తోందన్నారు. నిత్యం స్థానిక ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ పార్టీని విస్తృతం చేయాలన్నారు. మోడీ వైఫల్యం వల్లే పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాలు ధరలు పెరిగాయన్నారు. తక్షణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు యాండ్రపు కృష్ణ, కరక వెంకట్రావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, శిద్దిరెడ్డి శేషుబాబు, వర్రి అప్పారావు, మడకా రాజు, డి.వెంకటరావు, అల్లం పూర్ణిమ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

రైతులతో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - పెంటపాడు

మండలంలోని పరిమెళ్ల రైతు సేవా కేంద్రాన్ని జిల్లా జాయింటు కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరిమెళ్ల, యానాలపల్లి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో ఆయన మాట్లాడారు. సకాలంలో మీకు గోనె సంచులు ఇచ్చారా, సంబంధిత అధికారులు, సిబ్బంది మీ వద్దకు వచ్చారా, తదితర విషయాలను ఆయన రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రంలో వరి తేమశాతం చూసే టెక్నికల్ యంత్రాన్ని, రిజిస్టర్లను, ఇతర టెక్నికల్ పరికరాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఇంతవరకూ ఎంత ధాన్యాన్ని కొనుగోలు చేశారని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు జమ అయ్యాయా, ఇంకా ఎంత ధాన్యం రావాల్సి ఉందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించారా అని జెసి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి రైతులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు. కొనుగోలు ప్రక్రియకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్వయించుకుని రైతులకు మంచి సేవలందించాలన్నారు. పారదర్శకత జవాబుదారీతనం, అంకిత భావంతో ఆరుగాలం రైతులు శ్రమించి పండించిన పంటకు కనీస మద్దతు ధరలను కల్పించేందుకు పాటుపడాలని ఆదేశించారు. మిల్లుల వద్ద, కొనుగోలు కేంద్రాల వద్ద తేమ శాతాన్ని పరీక్షించే పరికరాలను క్యాలిబ్రేషన్ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. ఇకపై ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, మిల్లర్ల వద్ద తేమ శాతం పరికరాల్లో వ్యత్యాసాలు ఉత్పన్నం కావని ఆయన స్పష్టం చేశారు. రైతులు తమకు ఇష్టం వచ్చిన రైసు మిల్లులకు ధాన్యాన్ని తరలించుకుని విక్రయించుకునే వెసులు బాటు ఉందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సరిపడినన్ని గోనె సంచులను సిద్ధం చేసుకోవాలని, రైతులకు వారి పంట దిగుబడి తగ్గట్టుగా వారు కోరిన గోనె సంచులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఏడిదకోట శ్రీనివాస్, రెవెన్యూ, వ్యవసాయ, సివిల్ సప్లై, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు మోపడం దారుణం

సిపిఎం మండల మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు

మాట్లాడుతున్న కవురు పెద్దిరాజు

ప్రజాశక్తి - ఆచంట

రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న ట్రూఅప్ ఛార్జీలను తక్షణం విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అన్నారు. సిపిఎం ఆచంట మండల ఎనిమిదో మహాసభ మంగళవారం ఆర్యవైశ్య సత్రంలో అల్లం నాగమ్మ, తలుపూరి బుల్లబ్బాయి, సిర్రా నరసింహమూర్తి అధ్యక్షతన జరిగింది. ముందుగా కరుటూరి రాధమ్మ పతాకావిస్కరణ చేశారు. అనంతరం కరుటూరి రాధమ్మ, అల్లం నాగమణి, ఇందుకూరి సూర్యనారాయణ రాజు, కొండేటి సత్యనారాయణను సత్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నివేదికను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ ప్రవేశపెట్టారు. అనంతరం పెద్దిరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ ఛార్జీల భారం తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక రూ.18 వేల కోట్లు ప్రజలపై భారం మోపడం దారుణం అన్నారు. గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు ఇప్పుడు మోడీకి తలొగ్గి రైతులు, ప్రజలకు ఉరితాళ్ల బిగిస్తున్నారని, ప్రజలంతా దీన్ని వ్యతిరేకించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రానున్న కాలంలో ప్రజా సమస్యలపై అలుపెరుగని ఉద్యమాలు చేపడతామని దీనికి ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల ప్రక్రియను నిలుపుదల చేయాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మహాసభలో పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిర్రా నరసింహమూర్తి, ఎస్‌విఎన్.శర్మ, గుత్తుల రంగారావు, బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, బొర్రా ధర్మారావు పాల్గొన్నారు.

పాఠశాలల పని వేళలు పెంచొద్దు

జిఒ 117ను రద్దు చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆకివీడు

హైస్కూల్స్‌లో పని వేళలు సమయం పెంచే ఆలోచన విరమించుకోవాలని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్.నారాయణ(విక్రమ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం యుటిఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నారాయణ మాట్లాడుతు అనేక దశాబ్దాలుగా హైస్కూల్స్‌లో 7 గంటలు పనిచేస్తున్నాయని, కోఠారి కమిషన్ సూచనలకు అనుగుణంగా ప్రస్తుత సమయానికి కొనసాగించాలన్నారు. తెలుగు మీడియంలో కూడా బోధన జరగాలని, రోల్‌తో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలన్నారు. పాఠశాల విద్యకు సంబంధించిన జిఒ 117ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లీడర్‌షిప్ ట్రైనింగ్‌కి సంబంధించి ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించాలని కోరారు. బోధనేతర పనులు ఒత్తిడి వల్ల ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ మధ్యంతర భృతి, డిఎ బకాయిలను ప్రకటించక పోవటం శోచనీయం అన్నారు.



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్

మరుగుదొడ్ల వినియోగం అత్యవసరం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రస్తుత కాలంలో మరుగుదొడ్ల వినియోగంపై అత్యధిక అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద నిర్మించిన సిఎస్ఎల్ పరిశీలించారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. విద్యార్థులతో ముచ్చటించి అందరూ మరుగుదొడ్లు వినియోగించుకునేలా అవగాహన కల్పించారు. చివరిగా గ్రామ పారిశుధ్య కార్మికులను సత్కరించి నిత్యవసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఖతిబ్ కౌసర్ భానో, జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ, ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివివి నాగేశ్వరరావు, ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్, తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్‌సి షరీఫ్‌కు వినతి

నరసాపురం : నరసాపురంలో సోమవారం రాత్రి మాజీ శాసనమండలి ఛైర్మన్, అడ్వైజర్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మైనార్టీ అఫైర్స్) ఎంఎ.షరీఫ్‌ను 108 ఉద్యోగులు కలిశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ఉద్యోగులు ఆయనను కోరారు. అనంతరం షరీఫ్‌కు ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని షరీఫ్ అన్నారు.

విద్యార్థులకు కళల పట్ల అభిరుచిని పెంపొందించాలి

ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం ప్రసాద్

రాయకుదురు పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న యాజమాన్యం

ప్రజాశక్తి - వీరవాసరం

విద్యార్థి దశలోనే విద్యార్థులకు కళల పట్ల అభిరుచిని, ఉత్సాహాన్ని పెంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని ప్రజానాట్య మండలి కళాకారుడు, మ్యాజిక్ మురళీ స్మారక పాటల పోటీలను మండలంలోని రాయకుదురు జెడ్‌పి హైస్కూల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజానాట్యమండలి కళ కోసం కాదు కల ప్రజల కోసం అనే ఉద్దేశంతో ఆవిర్భవించిందని, ప్రజలను చైతన్యం చేయడం కోసం స్వాతంత్ర్యం ఉద్యమం ముందు నుంచే కృషి చేస్తుందన్నారు. ఎంతోమంది రంగస్థల, సినిమా కళాకారులు ప్రజానాట్యమండలి నుంచి వెళ్లిన వారేనని, నేటి యువత, విద్యార్థులు అందరూ కూడా కళల పట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కళాకారులుగా తీర్చిదిద్దింపబడాలని ఆయన అన్నారు. విద్యా కమిటీ సభ్యులు, కళా రంజని వ్యవస్థాపక అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో కళలకి ఎంతో ప్రాధాన్యత ఉందని, కళల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయవచ్చునని, విద్యార్థులు కూడా కళల పట్ల ఆవశ్యకత పెంచుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజానాట్యమండలి వారు స్కూలులో మ్యాజిక్ మురళీ జ్ఞాపకార్థం పాటల పోటీ నిర్వహించడం ఎంతో అభినందనీయమని, కళాకారులుగా మన విద్యార్థులు తీర్చిదిద్దబడాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు అంగర వేణు కాయలు వీరస్వామి పాల్గొన్నారు. అనంతరం పాటల పోటీలు నిర్వహించి సీనియర్స్ కె.వెన్నెల ప్రథమ, ఎ.భావన, ఎం.కీర్తనలకు ద్వితీయ బహుమతులు అందజేశారు. జూనియర్స్ విభాగంలో విల్లా పూజిత ప్రథమ, మంజు ద్వితీయ, జె.లాస్యలకు తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల గోడౌన్‌లో ఆర్‌డిఒ తనిఖీ

నరసాపురం: నరసాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు, పౌరసరఫరాల సంస్థ మండల స్థాయి గిడ్డంగులను, నిత్యావసర సరుకుల గోదామును మంగళవారం నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా అందించే నిత్యవసర సరుకులతో పాటు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు అందించే రేషన్ సరుకులు సకాలంలో డిపోలకు అందించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. డిసెంబరు నెల రేషన్‌కు సంబంధించి కందిపప్పు, పంచదార, రెండు రకాల సరుకులను రేషన్ షాపుల ద్వారా అందజేస్తారన్నారు. ఒక కేజీ కందిపప్పు రూ.67, 1/2 కేజీ పంచదార రూ.17 చొప్పున ఒక కార్డు దారునికి అందజేస్తారని అన్నారు. బియ్యం ఉచితంగా ఇస్తారన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించే మూడు సరుకులను ప్రతి కార్డుదారునికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కందిపప్పు, పంచదారకు సంబంధించి సకాలంలో డిడి ప్రక్రియను పూర్తిచేసుకుని, కట్టిన రేషన్ షాపులకు నిత్యవసర సరుకులు పంపడం జరుగుతుందని ఆర్‌డిఒ దాసి దాసిరాజు అన్నారు. ఆర్‌డిఒ వెంట సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ, ఎం.ఆనంద్ రావు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

రైతులు మద్దతు ధర పొందాలి : ఆర్‌డిఒ దాసిరాజు

రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జిన్నూరు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు సందర్శించారు. అక్కడి రైతులతో కలిసి మాట్లాడారు. కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించి, గన్ని బ్యాగ్స్ సరిగా అందుతున్నాయా లేదా, వాహన రవాణా, మద్దతు ధర గురించి రైతులతో మాట్లాడారు. సాధారణ రకం 100 కేజీలకు రూ.2,300, గ్రేడ్ ఏ రకం రూ.2,320, 75 కేజీల సాధారణ రకం రూ.1,725, 75 కేజీల గ్రేడ్ ఏ రకం రూ.1,740 మద్దతు ధరగా పొందాలని రైతులకు సూచించారు. తక్కువ ధరకు దళారులను నమ్మి మోసపోవద్దని తెలియజేశారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యాన్ని పంపుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని రైతులకు తెలియజేశారు. అలాగే ధాన్యం మిల్లుకు పంపించిన తర్వాత 48 గంటల్లోగా రైతుల అకౌంట్లో డబ్బు జమవుతుందని తెలియజేశారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే స్థానిక అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, విఆర్‌ఒ నాగరాజు, సెక్రటరీ హరివిష్ణు, గ్రామ సర్పంచి, రైతులు పాల్గొన్నారు.

చిత్రకళా ప్రదర్శనలో వెంపటాపునకు స్థానం

తణుకు : అన బెర్లిన్ ఫైన్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ అరౌండ్ ది వరల్డ్-2024 పేరున జర్మనీ దేశం బెర్లిన్‌లో ఈనెల 20 నుంచి మూడు వారాల పాటు జరిగే చిత్రకళ ప్రదర్శనలో తనకు స్థానం దక్కిందని చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 50 మంది చిత్రకారుల కళాఖండాలతో ఈ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లైఫ్ మ్యాగజైన్ బెర్లిన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కాంటెంపరరీ ఈజిప్సియన్ చిత్రకారుడు డాక్టర్ ఖలీదు మునీర్, జర్మనీ చిత్రకారుల జ్యూరి సంయుక్తంగా తన చిత్రాలు ఎంపిక చేయడం పట్ల వెంపటాపు ధన్యవాదాలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి మూడు వందలకుపైగా అవార్డులు, రివార్డులు అందుకున్న వెంపటాపు బెర్లిన్ చిత్రకళా ప్రదర్శనలో చోటు దక్కడం పట్ల సామాజిక వేత్త డివిఎస్ఎస్.వర్మ, డాక్టర్ రమేష్‌చంద్రబాబు, వాద్రేవు సుందర్రావు, అక్కిపెద్ది రామసూర్యనారాయణ, తాడినాడ భాస్కరరావు అభినందించారు.

అభయపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్‌లో ఎదుర్కోవలసిన పరిణామాల గురించి నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్, గణపవరం ఎస్ఐ ఎం.మణికుమార్ వివరించారు. గణపవరం డిగ్రీ కాలేజీ విద్యార్థులకు మంగళవారం మహిళా రక్షణ వ్యవస్థ అభయపై వారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ సమాజంలో జరిగే ఎటువంటి నేరాలైనా గమనించినప్పుడు ధైర్యంగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. లేదా అభయ ద్వారా వివరాలు తెలియపరచకుండా అజ్ఞాతంగా సమాచారం ఇవ్వవచ్చునని చెప్పారు. విద్యార్థులు ఆక్టివ్ రోల్ తీసుకుంటే అభయ వంటి వ్యవస్థలు విజయవంతంగా పనిచేస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు టి.అక్కిరాజు, జి.వెంకటరమణ, జి.వెంకట్రావు, వి.శారదా దేవి, పి.భాస్కరరావు, రాణి దుర్గా, రమేష్ కుమార్, బాలమణికంఠ, గణపవరం ఎఎస్ఐ వరలక్ష్మి, సుధారాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మార్టేరులో ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

విజయవాడకు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వైవి.రావు హాస్పిటల్ నిర్వహణలో ఈనెల 20వ తేదీ బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు దేవాంగ కళ్యాణ మండపం కమిటీ ప్రతినిధి, పంచాయతీ సభ్యులు అల్లాడ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు మార్టేరు గ్రామంలో తాడేపల్లిగూడెం రోడ్‌లో వున్న మావుల్లమ్మ గుడి వెనుక ఉన్న దేవాంగుల కల్యాణ మండపంలో జరుగుతుందని, ఈ అవకాశం పరిసర వాసులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వాటర్ డిస్పెన్సరీ బహూకరణ

ప్రజాశక్తి - నరసాపురం


వాటర్ డిస్పెన్సరీ అందిస్తున్న పోలిశెట్టి శ్రీను

నరసాపురం పట్టణం పీచుపాలెంలో ఉన్న కళ్యాణి మానసిక వికలాంగుల పాఠశాలకు కొప్పర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పోలిశెట్టి శ్రీనివాస్ వాటర్ డిస్పెన్సరీని బహూకరించారు. పాఠశాల యాజమాన్యం వారి కోరిక మేరకు ఈ వాటర్ డిస్పెన్సరీని అందజేసినట్లుగా వారు తెలిపారు. ఈ సందర్భంగా పోలిశెట్టి శ్రీనివాస్‌కు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో అల్లూరి నళినీ దేవి పాల్గొన్నారు.

గణేశ్వరరావు ఆకస్మిక మృతి

ఆచంట : మండలంలోని కోడేరు దక్షిణపాలెం గ్రామానికి చెందిన ఆర్అండ్‌బి డిఇ ఇ.మైలే గణేశ్వరరావు(56) మంగళవారం ఆకస్మిక మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. ఈయన అకాల మృతి దళితులకు తీరని లోటని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఈ సందర్భంగా మైలే గణేశ్వరరావు భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పుష్ప రాజ్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల కోసం అనునిత్యం పరితపించే వారని, అంబేద్కర్ విగ్రహాల ఏర్పాట్లలో ఆయన పాలుపంచుకుని వారిని ఉద్యమాలకు తన వంతు కృషి చేసే వారని, అలాంటి వ్యక్తి మన మధ్యన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మాల మహానాడు అండగా ఉంటాదని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్లే రాజకుమార్, కోలాటి ప్రసాదరావు, నాయకులు బన్ను, రాంబాబు, నాగరాజు, భావన శ్రీనివాస్ నివాళులర్పించారు.

ఉన్నత శిక్షణతోనే మెరుగైన విద్య

ఉండి : ఉపాధ్యాయులు ఉన్నతమైన శిక్షణతోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందించగలరని సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్ అన్నారు. జిల్లావ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్వహణలో భాగంగా మంగళవారం ఉండి మండలం ఉప్పులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్బర్ చక్రవర్తి ఆధ్వర్యంలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ముఖ్యఅతిథిగా శ్యాంసుందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఉపాధ్యాయులు ఉన్నతంగా శిక్షణ పొందడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యను వారికి అర్థమయ్యే రీతిలో సులభతరంగా వివరించడానికి తోడ్పడుతుందన్నారు. ఉప్పులూరు, యండగండి, పలు పాఠశాలలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వ్యవసాయ శాఖ తనిఖీలు

పెనుమంట్ర : మండలంలోని స్థానిక నత్తా రామేశ్వరం, వెలగలవారి పాలెం, ఆలమూరు గ్రామాలలో మంగళవారం ఎరువులు, పురుగుమందుల షాపుల్ని వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ సంచాలకులు పి.మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఈ తనిఖీ జరిగింది. ప్రతి ఎరువుల డీలర్లు, పురుగు మందుల డీలర్లు తప్పనిసరిగా జిఎస్‌టిలో ఏదైతే డోర్ నెంబర్ ఉందో చూసుకొని లైసెన్స్‌లో కూడా అదే విధంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. ఎరువుల అమ్మకాలలో కంపెనీ ఓ ఫారం, పురుగుమందుల విషయంలో కంపెనీల పీసీలు ఉండాలని అలా ఉన్నటువంటి ప్రోడక్ట్‌లను మాత్రమే అమ్మకాలు చేయాలని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారిని ఎ.జోషిలా పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి

ఉండి : ప్రతి ఒక్క వాహన చోదకుడు ప్రయాణాలలో నిర్లక్ష్యం వహించకుండా హెల్మెట్ విధిగా ధరించాలని ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం ఉండి మెయిన్ సెంటర్‌లో వాహనాల తనిఖీ, హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి బయటకు వచ్చి, తిరిగి ఇంటికి క్షేమంగా వెళ్లేలా ఇంట్లోని వారికి భరోసా ఇవ్వాలని ఆయన సూచించారు. దీనికి ఉదాహరణగా ఇటీవల భీమవరం రహదారిలో జరిగిన ఘోర ప్రమాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.

నేరాలు - ఘోరాలు

బెల్ట్‌షాప్ నిర్వాహకుని అరెస్టు

ప్రజాశక్తి - తణుకు రూరల్

మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన గుమ్మడి రాజు బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ బి.లక్ష్మి, భీమవరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇటుక ట్రాక్టర్ బోల్తా

తృటిలో తప్పిన ప్రమాదం

పెనుగొండ : ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ట్రక్కుకు ఉండే పిన్ను ఊడి సుమారు వందమీటర్లు దూసుకెళ్లిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. తృటిలో తప్పిన పెను ప్రమాదం పెనుగొండ వెంకట్రామాపురం వద్ద జరిగింది. వివరాల్లోకెళితే.. ఇటుకల లోడుతోపాటు దూసుకెళ్లిన ట్రాక్టర్ ట్రక్కు ప్రధాన రహదారి పక్కనే ఉన్న పంటబోదిలోకి తిరగబడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి వెంబడి వాహనదారులు ప్రయాణం చేస్తుంటారు. ఘటన సమయంలో ఇటుకులలోడుతో ట్రక్కుపై ప్రయాణిస్తున్న నలుగురు జట్టు కార్మికులు ప్రాణాప్రాయం నుంచి బయటపడ్డారు. నలుగురు కార్మికులకు గాయాలయ్యాయని స్థానికులు చెబుతున్నారు. వైద్యం నిమిత్తం స్థానికులు ఆసుపత్రికి తరలించారు. గాయాల పాలైన కార్మికులు తూర్పుగోదావరి జిల్లా ఖండవల్లి గ్రామానికి చెందిన వారిగా సమాచారం.

ఇంట్లో చోరీ

ఉండి : మండలంలోని పాందువ్వ గ్రామానికి చెందిన అల్లూరి రవికుమార్ ఈనెల 15వ తేదీన హైదరాబాద్ వెళ్లి తిరిగి 18వ తేదీ ఉదయం తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు, రూ.45 వేలు విలువచేసే వెండి, బంగారం ఆభరణాలు చోరీకి గురయ్యాయన్నారు. అల్లూరి రవికుమార్ మంగళవారం ఉండి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ దువ్వాపు శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వైద్యులు అందుబాటులో లేక అవస్థలు..!

స్టాఫ్ నర్సులతో వైద్య సేవలు

ప్రజాశక్తి - పెనుగొండ

వైద్యులు 24 గంటలూ రోగులకు అందుబాటులో ఉండటం లేదని సామాజిక ఆరోగ్య కేంద్రం(సిహెచ్‌సి) రోగులు ఆవేదన చెందుతున్నారు. పెనుగొండ మండల కేంద్రమైన సిహెచ్‌సి వైద్యులు ఉదయం పూట అందుబాటులో ఉంటున్నారని, మిగిలిన సమయంలో స్టాఫ్‌నర్స్‌లతో వైద్యం అందిస్తున్నారని, అత్యవసరమైనప్పుడు డాక్టర్లను పిలుస్తామని పొంతన లేని సమాధానం చెబుతున్నారన్నారు. డాక్టరు ఎప్పుడొస్తారని అడిగితే ఎందుకు, ఏమిటి అని నర్సులు సమాధానం చెప్తున్నారని, ప్రతిరోజు ఇదే సమాధానంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఖాళీగా దర్శనమిస్తున్న సిహెచ్‌సి వైద్యుల రూం

పేదలకు అందుబాటులో ఉండవలసిన డాక్టర్లే ఇలా వ్యవహరిస్తే పేదలు వైద్యానికి ప్రయివేట్ హాస్పటల్స్ ఆశ్రయించాల్సి వస్తుందని, 24 అవర్స్ డాక్టర్లు ఉండవలసిన సిహెచ్‌సిలోనే ఇలా జరిగితే పేదవాడికి వైద్యం కరువవుతోందని వాపోయారు. గ్రామాల్లో 104 డాక్టర్లు లేకపోవడంతో అంతంతమాత్రంగానే వైద్య క్యాంపులు నడుస్తున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడంలో రోగుల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా సిహెచ్‌సి ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండాలని రోగులను కోరుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో ఆర్ఎంపిలు(ఫస్ట్ డే) ఇష్టానుసారంగా రోగుల దగ్గర డబ్బులు దండుకుంటున్నారని, పుట్టగొడుగుల్లా మెడికల్ షాపులు వెలుస్తున్నాయని, రోగుల బహిరంగంగా విమర్శిస్తున్నారు.

గ్రంథాలయ వారోత్సవాల ముగింపును విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ఈనెల 20న నిర్వహించనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. విద్యార్థులు, వివిధ పోటీ పరీక్షలకు హాజరవుతున్న యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం(త్యాగరాజ భవనం) సాయంత్రం 4 గంటలకు ముగింపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈమేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ ముగింపు సభలో నాలుగు అంశాలపై ప్రముఖులు ప్రసంగిస్తారన్నారు. సివిల్ సర్వీసెస్ అండ్ గ్రూప్స్ ప్రిపరేషన్, స్ట్రాటజీ అండ్ ప్లానింగ్, సురక్షితమైన ఆర్థిక భవిష్యత్తు కోసం ప్రణాళిక : ఇప్పటి సమయం మించి పోలేదు, ఇటీవల కాలంలో పుస్తక పఠనం ఒక అలవాటుగా : సవాళ్లు అధిగమించడం, పోటీ ప్రపంచంలో యువత మానసిక ఒత్తిడి : సవాళ్లు అధిగమించడం అనే అంశాలపై ప్రముఖ వక్తలు ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఈ నాలుగు అంశాలపై ప్రసంగించి పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందని, పట్టణ, పరిసర గ్రామాల విద్యార్థులు, వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొంటున్న యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాల్యం నుంచే సమైక్యతా భావాలు నేర్పించాలి

జాతీయ సమైక్యతతోనే దేశ సమగ్రత అని, బాల్యం నుంచి సమైక్యతా భావాలు కలిగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నేర్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం భీమవరం భారతీయ విద్యా భవన్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతి విద్యా భవన్‌లో చదువరుల సంఘం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సమైక్యత ర్యాలీ, ప్రతిజ్ఞ, వివిధ పోటీలను జెసి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యతతోనే దేశ సమగ్రత అన్నారు. బాల్యం నుంచి సమైక్యత భావాలు కలిగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు అలవాటు చేయాలన్నారు. చిన్నతనం నుంచే గ్రంథాలయాలను అనుసరించి మంచి పుస్తకాలను చదివితే ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు అన్నారు. తల్లిదండ్రులు చిన్నతనం నుంచి పిల్లలకు గ్రంథాలయాలకు పంపించడం అలవాటు చేయాలని అన్నారు. ఒకప్పటి మేధావులంతా గ్రంథాలయాలను అనుసరించేవారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ ఎం.రఘుపతి రాజు, ప్రిన్సిపల్ దేవి పద్మ, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఎఇఆర్‌కె.రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరం : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం అభయ సాధికారిక మహిళ అనే అంశంపై పిప్పర ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ కె.ప్రియాంక ఆధ్వర్యంలో చర్చ నిర్వహించారు. అనంతరం ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు పి.రంగారావు, న్యాయవాది గుడ్ల వెంకట కృష్ణారావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పాలకోడేరు : గొల్లలకోడేరు శాఖ గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని విద్యార్థులకు మంగళవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక మహిళా పోలీస్ బి.విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని గ్రామానికి, విద్యార్థుల తల్లిదండ్రులకి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. గ్రంథాలయాధికారి జి.బాలరాజు మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులకు వివిధ రంగాలలో ఆటల పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థులుగా నిలిచిన వారికి గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి హాజరుకానున్నట్లు వెల్లడించారు.

నరసాపురం: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని వనిత, లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు. మంగళవారం శాఖ గ్రంథాలయంలో మహిళా దినోత్సవం, క్విజ్ పోటీలు నిర్వహించారు. కీర్తిశేషులు, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి మహిళ విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థితికి చేరుకోవచ్చునన్నారు. న్యాయవాది సంతోషికుమారి మాట్లాడుతూ మహిళలకు కల్పించే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ అధికారిణి కుమారి, ఉషాకమల, నళినిదేవి, సత్యవతి, భరణి, స్వర్ణలత, సూర్యంబాబు, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ మహిళా సాధికారిత కోసం ఎంతగానో కృషి చేశారని, ఆమె పాలనలో బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు జరిగిందని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కనుమూరి బాపిరాజు అన్నారు. మంగళవారం భీమవరం కాంగ్రెస్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి అంకెం సీతారామ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బాపిరాజు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర భారతావనికి మొట్టమొదటి, ఏకైక మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అని, ఆమె 49 ఏళ్ల వయసులోనే పదవీ బాధ్యతలు స్వీకరించారని, నాలుగు సార్లు ప్రధానిగా సుమారు 16 ఏళ్లకుపైగా దేశానికి సేవలందించారని అన్నారు. ఇన్‌ఛార్జి అంకెం సీతారామ్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ అంటేనే ధైర్యం, ఆత్మవిశ్వాసం, తెగువ, అంకుఠిత దీక్ష, సాధికారత వంటివి గుర్తుకు వస్తాయని, ఒక మహిళగా ప్రపంచస్థాయి నేతలతో పోటీ పడి దేశాన్ని పాలించిన రాజనీతిజ్ఞురాలు, సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడానికి ఇందిరా గాంధీ పెట్టింది పేరన్నారు. ఇందిర తన పాలనా కాలంలో వ్యవసాయం నుంచి అంతరిక్షం, దేశ ఆర్థిక స్వావలంబన నుంచి అణుశక్తి దాకా ఎన్నో అంకురార్పణలకు ఆద్యురాలని అన్నారు. అనంతరం మహిళలకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జంపన సుబ్రహ్మణ్య రాజు, కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మార్నేడి బాబ్జీ, కాంగ్రెస్ జిల్లా యూత్ ప్రెసిడెంట్ సోము నాగ కేశవబాబు, మహిళా నాయకులు సోడదాసి సెల్వియా, బోణం రవికుమార్, ఎవి.రామరాజు, వీరవాసరం ప్రెసిడెంట్ మేడపాటి సాగర్, గంజల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ఎం.సుధారాణి, గుమ్మడి సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండి : భారతరత్న ఇందిరాగాంధీ అత్యంత మహిళా శక్తిగా నిలిచి ఎంతోమంది స్త్రీలకు ఆదర్శప్రాయంగా నిలిచారని విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా సత్య కృష్ణ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఉండి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జెవి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా గాంధీ 108వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యకృష్ణ ప్రసాద్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగు పర్యాయాలు ప్రధానమంత్రిగా పనిచేసిన ఇందిరా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమంలో ఎంతో ధైర్య సాహసాలతో బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడారని, ఆమె పోరాట స్ఫూర్తిని ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆయన కోరారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పి.శ్యామలరావు, శశి స్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్మార్ట్ ఇండియా హెక్త్రాన్ ఫైనల్ పోటీలకు పెన్నాడ విద్యార్థులు

ప్రజాశక్తి - పాలకోడేరు

భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పెన్నాడ కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఇండియా హెక్రాన్ 2024 ఫైనల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పర్తి సురేష్ తెలిపారు. ఫిషరీస్, యానిమల్ హస్బండ్రీ అండ్ డైరైయింగ్ మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమస్యకు పరిష్కారాన్ని ప్రతిపాదించి దేశం నుంచి 5 టీమ్స్ సెలెక్ట్ కాగా దీనిలో తమ కళాశాల టీం ఒకటి అని తెలిపారు. డిసెంబర్ 11వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు ఐఇఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్, భోపాల్‌లో జరిగే ఫైనల్ పోటీలో పాల్గొని తమ ప్రాజెక్టుని ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎస్ఐహెచ్ ఎస్పిఓసి ఎబిఎస్ఆర్.మనోహర్, అకడమిక్ డీన్ డాక్టర్ కురెళ్ల భాస్కరరావు, హెచ్ఒడిలు అభినందించారు.

కాళ్ల : కనకరాజు సూరిని సత్కరిస్తున్న జనసేన నేతలు

క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన వేగేశ్న సూర్యనారాయణ రాజు(కనకరాజు సూరి)ని మంగళవారం జనసేన నేతలు సత్కారించారు. వేగేశ్న సూర్యనారాయణ రాజు(కనకరాజు సూరి)ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, జనసేన నాయకులు అరేటి దిలీప్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి : నిస్వార్థ నాయకుడు, పార్టీకి వీర విధేయుడు కనకరాజు సూరికి కూటమి ప్రభుత్వంలో తగిన గుర్తింపు లభించిందని ఉండి మండలం కలిగొట్ల టిడిపి గ్రామ అధ్యక్షులు రుద్రరాజు సూర్యనారాయణ రాజు, ఆరేడు టిడిపి గ్రామ అధ్యక్షులు గొట్టం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కలిగొట్ల, ఆరేడు గ్రామాలకు సంబంధించిన టిడిపి నాయకులు క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న సూర్యనారాయణ రాజు(కనకరాజు సూరి)ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కనకరాజు సూరిని కలిసిన వారిలో యశోద కృష్ణయ్య, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, బురిడీ సురేష్ బాబు ఉన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు వాయిదా

ప్రజాశక్తి - నరసాపురం

నీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఇరిగేషన్ డిఇ వెంకటనారాయణ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం బుధవారం నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. అయితే ఎంఎల్‌సి కోడ్‌తో పాటు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున్న ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. తిరిగి నోటిఫికేషన్ ఎప్పుడు జారీ అవుతుందోనన్నది తెలియాల్సి ఉందన్నారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో ఫెమినా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దేశ మొదటి స్వతంత్ర పోరాట కాలంలో పోరాట యోధురాలిగా నిలిచిన ధీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి 190వ జయంతి వేడుకలు ఇమ్మిడి లలిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నా ఒంటిలో రక్తపు చుక్క, చేతిలో ఖడ్గం ఉన్నంత వరకు ఏ విదేశీయుడు రాజ్యాన్ని ఆక్రమించే సాహసం చేయడని అన్నారని చెప్పారు. పుట్టిన నేల కోసం కత్తి పట్టిన వీరవనిత అని, పెళ్లయిన 2 సంవత్సరాలకే భర్త మరణించినా ఆమె ధైర్యం కోల్పోలేదని, రాజ్యం బాధ్యతలు అన్ని స్వీకరించి దామోదరరావు అనే అబ్బాయిని దత్తత తీసుకుని భావిరాజుగా ప్రకటించిందన్నారు. కానీ రాజ్యాన్ని ఆక్రమించాలన్న దుర్బుద్ధితో బ్రిటిష్ వారు ఆమెపై దాడి చేశారని, 15 రోజులపాటు యుద్ధం చేశారని, గ్వాలియర్ వద్ద బ్రిటిష్ వారు లక్ష్మీబాయిను వధించారని చెప్పారు. చివరి నిమిషం వరకు దేశం కోసం పోరాడే ఎందరినో ప్రభావితం చేసిన వీరవనిత ఝాన్సీ అని చెప్పారు. అనంతరం మొదటి మహిళా ప్రధాని అయిన ఇందిరా గాంధీ గూర్చి విద్యార్థులకు వివరించారు. బ్యాంకులు జాతీయ కరణంలో, పాకిస్తాన్‌పై యుద్ధం చేసి బంగ్లాదేశ్‌కి స్వాతంత్రం ఇప్పించుటలో ఈమె కృషి అమోఘమని చెప్పారు. అనంతరం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ మాచేపల్లి ఉమ, నంబూరి భాగ్యలక్ష్మి, కంచర్ల సుశీల, హెచ్ఎం భవానీ ప్రసాద్ రాయపూడి, ఉపాధ్యాయులు చంద్రకళ, భవానీ దుర్గ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనుండాలి

పలుచోట్ల విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - భీమవరం

విద్యార్థి దశనుంచే ప్రతి విద్యార్థి చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సరళ సూచించారు. భీమవరం ఝాన్సీ లక్ష్మీబాయి గర్ల్స్ పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ శరల మాట్లాడుతూ విద్యార్థులు బాల్య వివాహాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు చేసుకున్నా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలు చేసుకుంటే అనేక అనారోగ్య సమస్యలు రావడంతో పాటు తల్లీబిడ్డకు ప్రమాదం కూడా పొంచి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అందుతున్న సేవలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి.దుర్గ, ఎన్.సూర్య ప్రభ, కె.స్వర్ణలత, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : బాల్య వివాహ నిరోధక చట్టం 2006పై అవగాహనా కార్యక్రమం తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆర్.రాజేష్ మాట్లాడుతూ బాల్యవివాహాల చట్టం 2006, జిఒ ఎంఎస్ నెం.31, 39 సెక్షన్స్ గురించి వివరించారు. అడాప్షన్ మేనేజర్ జయలక్ష్మి మాట్లాడుతూ ఇల్లీగల్ అడాప్షన్ వల్ల కలిగే అనర్థాలు, శిక్షల గురించి తెలియజేశారు. పట్టణ ఎస్ఐ పి.నాగరాజు సైబర్ నేరాలు, వాటి నుంచి ఎలా బయటపడాలో తెలియజేశారు. బాల్య వివాహాలు నిరోధించాలని ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ తెలియజేశారు. తణుకు ప్రాజెక్ట్ సిడిపిఒ ప్రమోద, తాడేపల్లిగూడెం ప్రాజెక్ట్ సిడిపిఒ టివి.సరస్వతి మహిళా చట్టాలు, బాల్యవివాహాల చట్టం గురించి వివరించారు. డివిజనల్ ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

భీమవరం : మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ సరళ

పాలకొల్లు రూరల్ : మండలంలోని చింతపర్రు, పూలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో బాలల హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.మమతశ్రీ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు వారి హక్కుల గురించి, బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల జరిగే నష్టాల గురించి, నిర్భయ చట్టం ఏవిధంగా పనిచేస్తుంది, వరకట్న నిషేధ చట్టం గురించి, పాఠశాలల్లో ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. గ్రామ సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యవేణి, ఎన్.మంగ, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సులు

నరసాపురం : కార్తీకమాసం నేపథ్యంలో నరసాపురం డిపో నుంచి పంచారామ క్షేత్రాలను దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక బస్సులు తిప్పుతున్నట్టు ఇన్‌ఛార్జి ఆర్‌టిసి డిపో మేనేజర్ పిఎన్‌వి ఎంఎస్ఎన్.మూర్తి చెప్పారు. ఈమేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆదివారం రాత్రి బయలుదేరే ఈ బస్సులు సోమవారం ఒక్క రోజులోనే అన్ని క్షేత్రాలను దర్శించి తిరిగి నరసాపురానికి చేరుకుంటాయని వివరించారు. ఈనెల 24వ తేదీ చివరి కార్తీక సోమవారం కావడంతో నరసాపురం బస్టాండ్ నుంచి రాత్రి 9 గంటలకు బయలు దేరతాయన్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నామని చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. శబరిమల, శ్రీశైలం వెళ్లే యాత్రికులకు, విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు.

పత్రికా ప్రకటన

విషయం : నా కుమారుడు SSC సర్టిఫికెట్ నందు నా ఇంటి పేరులో గల అక్షర దోషమును సరిచేసుకుంటున్న విషయమును పత్రికాముఖంగా తెలియపరచుట గురించి. మా కుమారుడు అయిన తన్నీడి అనీల్ కుమార్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, భీమవరంలో SSC చదవడం జరిగింది. మా కుమారుడి యొక్క SSC సర్టిఫికెట్‌లో నా యొక్క పేరు **TANNIDI KANAKARAJU** గా ముద్రించబడినది. కానీ నా యొక్క అసలు పేరు **TANNEDI KANAKARAJU** నా ఇంటి పేరులో గల దోషమును సరిచేసుకుంటున్నాను. ఈ విషయాన్ని పత్రికాముఖంగా ప్రజలందరికీ తెలియజేసుకుంటున్నాను.
ఇట్లు
తన్నీడి కనకరాజు
కోమటి తిప్ప పంచాయితీ
నీటితిప్ప గ్రామం, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా

దస్తావేజు పోయినది

శ్రీమతి **మంతెన మరియమ్మ,** భర్త గంగరాజు, ఆర్.ఎస్.నెం.43/13 కొండలరావు పాలెం, పెదవేగి మండలం, అను నాకు గల ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్ నెం.3386/1999లు మా ఇంటి వద్ద నుండి బ్యాంక్ లోను నిమిత్తం తీసుకుని వెళ్ళుచుండగా మార్గమధ్యంలో విజయరాయి సమీపంలో పడిపోయినవి. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌లో తెలియజేయవల్సినదిగా కోరుచున్నాను.

మంతెన మరియమ్మ, భర్త గంగరాజు, కొండలరావుపాలెం, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా. సెల్: 9849333808.

పాస్‌పోర్టు పోయినది

పాలకొల్లు రూరల్ పంచాయతీలో డోర్. నెంబర్.11-24, బోళ్ళవాని తోట, నాగరాజు పేట, పాలకొల్లు రూరల్ పంచాయతీ, ప.గో.జిల్లా, ఎ.పి లో నివసిస్తున్న **షేక్ హుస్సేన్,** తండ్రి షేక్ నాగూర్ తెలియ జేయునది ఏమనగా నేను ది **04- 10-2012**లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి K8532385 పాస్ పోర్ట్ తీసుకున్నాను. మేము మా ఇల్లు ది **29-10-2024**న షిఫ్ట్ అయిన సందర్భంగా నా ఒరిజినల్ పాస్ పోర్ట్ మిస్ అయినది. ఎంత వెతికినా దొరకలేదు కాబట్టి ఎవరికైనా దొరికితే నాకు అందజేయవలసిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

సెల్ నెంబర్ : 9110585129

స్కూలు సర్టిఫికేట్ పోయినది

ఏలూరు జిల్లా, చిన నింద్రకోలను గ్రామానికి చెందిన **మంత్రబుద్ది చిన అప్పారావు** కుమారుడు మంత్రబుద్ది శివ కన్న కుమార్ కి చెందిన పదవ తరగతి స్కూలు సర్టిఫికెట్ జిరాక్స్ నిమిత్తం చిననింద్రకోలను నుండి మోటారు సైకిల్ పై నిడమర్రు వెళ్ళి జిరాక్స్ తీసుకుని తిరిగి చిననింద్రకోలను వస్తుండగా సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలుతో ఉన్న సంచి మార్గ మద్యంలో పడిపోయినవి. ఎంత వెదికినా దొరకలేదు. కావున సర్టిఫికెట్ జిరాక్స్ ఉన్న సంచి దొరికితే ఈక్రింది అడ్రస్‌కి ఇవ్వగలరు.

మంత్రబుద్ది శివ కన్న కుమార్, తండ్రి చిన్న అప్పారావు, చిన నింద్రకోలను (పత్తేపురం), నిడమర్రు మండలం ఏలూరు జిల్లా. 9849481317

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
S.O.P.No.3/2024

బిట్వీన్ :
పిటీషనర్స్ :
1.వంగమామిడి వెంకట సుబ్బారావు
2.వంగమామిడి మాధవ కృష్ణ నిఖిల్
3.వంగమామిడి జయత్రి నాగసాయి
Vs
రెస్పాండెంట్స్ : - నిల్-

పై నంబరు పిటిషన్‌లో నర్సాపురం వాస్తవ్యులైన లేటు వంగమామిడి వీర దుర్గా రామలక్ష్మి గార్కి వారసులుగా పిటిషనర్స్‌ను డిక్లేర్ చేయమని కోరుచూ పిటిషనర్స్ పై నంబరు పిటిషన్ దాఖలు చేసుకునియున్నారు. సదరు పిటిషన్‌ను పై కోర్టు వారు ది.**12-12-2024**వ సం. తేదీన వాయిదా వేసియున్నారు. కావున పై నంబరు పిటిషన్‌పై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న ఎడల వారు వాయిదా తేది అయిన ది.**12-12-2024** సం. తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకున్న ఆక్షేపణలు తెలియచేయవలెను. లేనిచో పిటిషనర్స్ పక్షముగా తీర్మానించబడును.

(By Order of the court)

కొప్పర్తి వెంకట సుబ్రహ్మణ్యం, బి.కాం., బియల్., నర్సాపురం అడ్వకేటు, నర్సాపురం, ప.గో.జిల్లా.
తేది.19-11-2024 సెల్ :9866068748.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 66-68/General/2024-25, Dated. 18-11-2024

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Supply and Delivery of LED Street Lights to Municipal Corporation, Eluru"** Total No of works is **3** with an amount of Rs. **29.30** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 20-11-2024. Last date of receipt of tenders is 23-11-2024. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU